క్లుప్తంగా

ఘనంగా నవరాత్ర ఉత్సవాలు



సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

కె.గంగవరం: మండలంలోని అముజూరులో ఉన్న సాయిబాబా మందిర వార్షికోత్సవం సందర్భంగా నవరాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గత తొమ్మిది రోజులుగా భజనలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. ముగింపు సందర్భంగా సాయిబాబు విగ్రహానికి ఉదయం క్షీరాభిషేకం నిర్వహించి పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద భక్తుల విరాళాలతో భారీ అన్నదానం నిర్వహించారు. పామర్రు, పాణింగపల్లి, నరజాడ, కూళ్ల తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నవరాత్ర ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

ఈ-పంట ముసాయిదా జాబితా ప్రదర్శన



తాళ్లపాలెం రైతు సేవా కేంద్రం వద్ద ఈ-పంట జాబితా ప్రదర్శిస్తున్న వ్యవసాయ అధికారులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని రైతు సేవా కేంద్రాల వద్ద ఈ-పంట ముసాయిదా జాబితాను ప్రదర్శనకు ఉంచినట్లు మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ మంగళవారం విలేకరులకు తెలిపారు. జాబితాలో ఏవైనా మార్పులు, చేర్పులు ఉంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు. రామచంద్రపురం ఏడీఏ ఏఎస్వీ రంగారావుతో కలిసి తాళ్లపాలెం రైతు సేవా కేంద్రంలో జాబితా ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు సీహెచ్ యువరాజు, హేమంత్, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

అనాథ చిన్నారులకు నిత్యావసర సరకుల వితరణ

మండపేట: చక్కటి విద్యా బోధన ద్వారా డిగ్రీ కాలేజీ విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దడమే కాకుండా దాతృత్వ కార్యక్రమాల్లోనూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు మండపేట డిగ్రీ కాలేజీ అధ్యాపకులు. మారేడుబాకలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది కలసి ఏలేశ్వరం మండలం పెద సంకర్లపూడిలో బేతెస్థ ఆశ్రమానికి చిన్నారుల సంరక్షణ కోసం 20 మంచాలు వితరణ చేశారు. దాతల సహకారంతో నాలుగు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, పరీక్ష సామగ్రిని మంగళవారం ఆశ్రమ నిర్వాహకులకు అందించించామని ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాస్ తెలిపారు. కరోనాతో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లలకు సహాయమందించిన బేతెస్థ ప్రార్థనా మందిరం నిర్వాహకులు పాస్టర్ కిషోర్‌ను ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కిరణ్ కుమార్, గోపాలకృష్ణ, మధుకుమార్, అభినయ్, రామకృష్ణ, నరేష్, అనపర్తి సర్పంచ్ వారా కుమారి పాల్గొన్నారు.

సోము వీర్రాజుకు ఎమ్మెల్సీపై హర్షం

రామచంద్రపురం: బీజేపీలో గత కొన్నేళ్లుగా విస్తృత సేవలందిస్తున్న పార్టీ సీనియర్ నేత సోము వీర్రాజుకు ఎమ్మెల్యేల కోటా నుంచి పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయటం హర్షణీయమని బీజేపీ సీనియర్ నేత కుప్పల సూర్యనారాయణ అన్నారు. పట్టణంలో ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంటున్న బీజేపీ నుంచి రెండోసారి సోము వీర్రాజును బీజేపీ అధిష్టానం ఎంపిక చేయడం ద్వారా పార్టీకి విధేయతగా ఉండే కార్యకర్తలకు ఎప్పుడూ న్యాయం జరుగుతుందనే సందేశం పార్టీ ఇచ్చిందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో బీజేపీ కీలకంగా వ్యవహరించనుందని ఆయన స్పష్టం చేశారు.

జాబ్‌మేళాలో 26 మంది ఎంపిక

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆపోలో ఫార్మసీ, ముత్తూట్ ఫైనాన్స్, ఇన్నోవా సోర్స్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 26 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపీడీఓ పద్మజ్యోతి మాట్లాడుతూ ఉద్యోగాలను సద్వినియోగం చేసుకుని కెరీర్‌లో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రజాపరిషత్ ఏఓ చాగంటి వెంకట అచ్యుతరామ సుబ్రహ్మణ్యం, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కె.రాజేంద్ర ప్రసాద్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఆర్.రఘువర్మ, ఈఎస్సీ కోఆర్డినేటర్ పి.లావణ్య, ఆయా కంపెనీల హెచ్ఆర్‌లు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనతో సువర్ణాధ్యాయం

- కష్టాలను ఎదుర్కొని సంక్షేమ సారథిగా నిలిచిన వైఎస్ జగన్
- దేశాన్ని ఆకర్షించిన వైఎస్సార్ సీపీ పథకాలు
- ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యలపై ఉద్యమాలు
- అధికారం చేపట్టాక ప్రజారంజక పాలన
- నేడు 15వ వసంతంలోకి అడుగుపెడుతున్న వైఎస్సార్ సీపీ



కరెంటు చార్జీలు తగ్గించాలంటూ మండపేటలో ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్సీ తోట తదితరులు (ఫైల్)



రామచంద్రపురంలో డిసెంబర్ 27న కరెంటు చార్జీలు పెంచడాన్ని నిరసిస్తూ ర్యాలీ చేస్తున్న పిల్లి సూర్యప్రకాశ్, నాయకులు (ఫైల్)

కపిలేశ్వరపురం: వైఎస్సార్ సీపీ ఆవిర్భావం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఓ చారిత్రక అవసరంగా పరిణమించింది. పురుటిలోనే అష్టకష్టాలను ఎదుర్కొంటూ, ప్రజాఉద్యమాల్లో తలమునకలవుతూ ముందుకు సాగింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓదార్పు యాత్ర తండ్రి పట్ల ప్రేమాభిమానాలు కనబర్చిన ప్రజల కోసం చేపట్టినది కాగా తర్వాత కాలంలో చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర పేద, మధ్య తరగతి ప్రజలకు భరోసానిస్తూ సాగిన యాత్ర ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసింది. అధికారంలో ఉన్నప్పుడు సంక్షేమ బాటలోనూ, లేనప్పుడు ప్రజా ఉద్యమాల్లోనూ ప్రతిక్షణం ప్రజల పక్షాన నిలిచిన పార్టీ వైఎస్సార్‌సీపీ. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని ప్రజల గుండెల్లో నాటుకుపోయిన పార్టీగా వైఎస్సార్ సీపీ నిలిచింది. ఆ పార్టీ 15వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ కథనం....

వైఎస్సార్ సీపీ ఆవిర్భావ నేపథ్యమిదీ

దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం ఆయన ఆశయ సాధనకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుం కట్టారు. వైఎస్ మరణాన్ని తట్టుకోలేక ప్రాణాలు వదలిన కుటుంబాలను ఓదార్చేందుకు వైఎస్ జగన్ 2010 ఏప్రిల్ 9న ఓదార్పు యాత్ర ప్రారంభించారు. 2010 డిసెంబర్ 21న విజయవాడలో కృష్ణాతీరాన ప్రజా సమస్యలపై లక్ష్య దీక్ష చేపట్టారు. 2011 మార్చి 11న వైఎస్సార్ సీపీ పేరును ప్రకటించారు. 12న ఇడుపులపాయలో వైఎస్సార్ సమాధి వద్ద వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించి పార్టీని స్థాపిస్తున్నట్టు ప్రకటన చేశారు. 2017 నవంబర్ 6 నుంచి 2019 జనవరి 9 వరకూ 14 నెలలు పాటు 3,648 కిలోమీటర్ల ప్రజాసంకల్ప యాత్ర చేపట్టి ప్రజల మనస్సులను గెలిచారు. 2019 ఎన్నికల్లో 50 శాతం పైగా ఓట్లు సంపాదించి 151 శాసన సభ, 22 లోక్ సభ స్థానాలను గెలిచి మే 30 సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఐదేళ్లు దేశాన్ని ఆలోచింపజేసే స్థాయిలో సంక్షేమ పాలను సాగించారు.

తప్పుడు ప్రచారం... అమలుకాని హామీలతో అధికారం

2019- 2024 మధ్య సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను అందించారు. వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన దాదాపు ప్రతి అంశాన్నీ అమలు చేసి చూపించింది. 2014-19 మధ్య కాలంలో టీడీపీ, 2024 జూన్ నుంచి నేటి వరకూ కూటమి పాలన సాగింది. ఆయా కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన ప్రతిపక్షంగా వ్యవహరిస్తూ ప్రజల తరపున ఉద్యమించింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమిగా ఏర్పడ్డ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనపై తప్పుడు ప్రచారం చేశారు. దానికి తోడు ఆయా పార్టీల అధినేతల నుంచి నియోజకవర్గ స్థాయి నాయకులు సైతం నోటికొచ్చిన హామీలను ఇచ్చారు. 2024 మార్చి 9న రామచంద్రపురం రూరల్ హసనబాదలో, ఏప్రిల్ 3న ద్రాక్షారామలో, జనవరి 20న మండపేట పట్టణం, ఏడిదలో టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజాగళం యాత్రలో పలు హామీలను ఇచ్చారు. ఏప్రిల్ 26న ద్రాక్షారామ సభలో, మే 1న మండపేట సభలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాట్లాడుతూ కూటమి మేనిఫెస్టో అమలుకు తాను హామీ ఇస్తున్నానంటూ గట్టిగా చెప్పారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా నేటికీ సాధారణ పింఛన్లు పంపిణీ తప్ప సూపర్‌సిక్స్‌లో పేర్కొన్న హామీలేవీ అమలు చేయలేదు.

ప్రజా ఉద్యమాలకు సంఘీభావం

2024 జూలైలో 04న మండపేటలో విద్యారంగ పరిరక్షణకు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. 10న కూటమి ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ అంగన్‌వాడీలు రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ర్యాలీలు నిర్వహించారు. అదేరోజు సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ డిమాండ్ల పరిష్కారానికి భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. 2024 ఆగస్టులో 12న రామచంద్రపురంలోని పాలిటెక్నిక్ కళాశాలను తరలించవద్దంటూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. 2024 నవంబర్‌లో 1న తమ ప్రాంతాల్లో మద్యం షాపులు ఏర్పాటు చేస్తుండటాన్ని నిరసిస్తూ మండపేట గొల్లపుంతలో, వెల్ల గ్రామంలో రోడ్డుపై ధర్నా చేశారు.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోరుబాట

2014-19, 2024 నుంచి నేటి వరకూ ప్రతిపక్ష పాత్రను పోషిస్తూ వైఎస్సార్ సీపీ ప్రజల సమస్యలపై ఉద్యమించింది. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, రెండు నియోజకవర్గాల పార్టీ కో ఆర్డినేటర్లు తోట త్రిమూర్తులు, పిల్లి సూర్యప్రకాశ్ జనంతో మమేకమవుతూ భరోసా ఇస్తూ వస్తున్నారు. 2024 డిసెంబర్‌లో 13న రైతాంగ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ జిల్లా కేంద్రమైన అమలాపురంలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమానికి రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. డిసెంబర్ 27న విద్యుత్ చార్జీలు పెంచడాన్ని నిరసిస్తూ మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం అమలాపురంలో నిరసన కార్యక్రమం నిర్వహించేందుకు సమాయత్తమయ్యారు.

స్థానిక సంస్థల్లో బాధ్యతాయుతమైన పాత్ర

రెండు నియోజకవర్గాల్లోని స్థానిక సంస్థల్లో ప్రజా ప్రతినిధుల్లో అత్యధికులు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే. రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీల కౌన్సిల్ సమావేశాల్లో, మండపేట రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం, రామచంద్రపురం, రూరల్, కె.గంగవరం, కాజులూరు మండల పరిషత్ సమావేశాల్లో కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను ఎండగడుతూ ఎన్నికల హామీలను అమలు చేయాలని వారి పరిధిలో ఒత్తిడి తీసుకొస్తున్నారు. మండపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు 2024 అక్టోబర్ 15, ఈ ఏడాది జనవరి 7లో నిర్వహించిన కపిలేశ్వరపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో రైతుల తరపున పంటల బీమాను ప్రభుత్వమే చెల్లించాలని, ఇతర ప్రజా సమస్యలపై అధికారులను, ప్రభుత్వ తీరును ఎండగట్టారు. జనవరి 24న మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో టిడ్కో లబ్ధిదారుల రుణాలను మాఫీ చేస్తామన్న హామీని అమలు చేయాలంటూ నిలదీశారు.

మండపేటలో నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు

మండపేట: నేడు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం మండపేటలో పార్టీ శ్రేణులు వేడుకలు ఘనంగా నిర్వహించనున్నాయి. 14వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు ఆధ్వర్యంలో పట్టణంలో, రూరల్ కన్వీనర్ పిల్లా వీరబాబు నేతృత్వంలో మండలంలో వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ముఖ్య అతిథిలుగా ఆయా కార్యక్రమాలకు హాజరవుతారని, స్థానిక విజయలక్ష్మి నగర్లోని పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ, కేక్ కటింగ్ చేయనున్నట్టు తెలిపారు. అలాగే పలు దాతృత్వ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామన్నారు. పార్టీ సీనియర్ నాయకులు రెడ్డి రాధాకృష్ణ, కర్రి పాపారాయుడు, వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి అతిథిలుగా హాజరవుతారని తెలిపారు. ఆవిర్భావ వేడుకలకు మున్సిపల్ వైఎస్సార్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం వారు కోరారు.

దుకాణాల వద్ద పరిశుభ్రత లోపిస్తే జరిమానా



కేపీ రోడ్డులోని బేకరీ యజమానికి శుభ్రత పాటించాలని సూచిస్తున్న కమిషనర్ రంగారావు

మండపేట: ప్రజలకు ఆరోగ్యవంతమైన వాతావరణం అందించాలనే సంకల్పంతో స్వచ్ఛ మండపేట నినాదంతో పట్టణ పరిశుభ్రతకు పాటుపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే దృక్పథంతో మున్సిపాలిటీ చేపట్టిన కార్యక్రమానికి పట్టణ ప్రజలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. దీనిలో భాగంగా ఆయన డీఈ కే శ్రీనివాస్, ఏఈ పవన్‌కుమార్, ఆంజనేయులు, ఆర్వో జీవీఎస్ శాస్త్రి, సచివాలయ సిబ్బందితో కలసి మెయిన్‌రోడ్డు, కేపీ రోడ్డు, ఏడిద రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, కేక్‌హౌస్‌లు వివిధ దుకాణాలను పరిశీలించారు. రాజారత్న రోడ్డులోని రెస్టారెంట్లను తనిఖీ చేసి అక్కడ అపరిశుభ్ర వాతావరణం నెలకొనడాన్ని గుర్తించి రూ.500 చొప్పున జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ రంగారావు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ఇంటి పరిసరాల్లోనే కాకుండా వ్యాపార కేంద్రాల వద్ద కూడా పాటించాలన్నారు. పన్నుల వసూళ్లకు మున్సిపల్ అధికారులు బృందాలతో ప్రతి వార్డుకు వస్తున్నారని ఆస్తి పన్ను చెల్లింపుదారులు సహకరించి పన్ను బకాయిలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ సామగ్రి వినియోగం నిషేధంలో ఉందని గుర్తు చేశారు. ఆర్ఐలు ఉప్పల శ్రీనివాసరావు, ఏజేఎన్ శ్రీనివాస్, టీపీవో కే రమ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, సచివాలయం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అగస్త్యేశ్వర, సర్వేశ్వర స్వామి కల్యాణోత్సవాలు



అన్నప్రసాదాలను స్వీకరిస్తున్న భక్తులు

మండపేట: అగస్త్యేశ్వర స్వామి దేవాలయం (రథంగుడి)లో వేంచేసిన అగస్త్యేశ్వర కైలాసేశ్వర స్వామి, సర్వేశ్వర స్వామి వార్ల దివ్య కల్యాణోత్సవాలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం ప్రారంభమైన కల్యాణ వేడుకలు ఈ నెల 15 శనివారం వరకూ కొనసాగనున్నాయని ఆలయ కార్యనిర్వహణాధికారి కామేశ్వరరావు తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. ఆలయ అర్చకుడు అయినవిల్లి నూరు వరహాలు ఆధ్వర్యంలో శతప్రతిష్టాచార్య పెదపర్తి వాస్తవ్యులు బ్రహ్మశ్రీ యలమంచిలి కృష్ణమూర్తి శివాచార్య సారథ్యంలో కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పుష్పాలంకరణలో స్వామి వార్లు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ (రాజబాబు), మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కమ్మ సంఘం కార్యదర్శి వల్లూరి చిన్నారావు, శిరంగు ఈశ్వరరావు స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో 6 వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. దాతలు కాళ్లకూరి నాగబాబు, గ్రంధి నమఃశ్శివాయ, గ్రంధి శేషగిరి, మాటుమర్రి భవానీ శంకరం, గ్రంధి రంగా, చెన్నా గాంధీ పాల్గొన్నారు.

నేడు దండు మారెమ్మ జాతర

రాయవరం: వెంటూరు గ్రామ దేవతగా పూజలు అందుకుంటున్న దండు మారమ్మ తల్లి జాతర బుధవారం వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. జాతర నిర్వాహక కమిటీ సభ్యులు రిమ్మలపూడి దొరబాబు, ముత్యాల వీరబాబు, గొడితి సత్యం మాట్లాడుతూ ఉదయం గరగ గ్రామోత్సవం, నైవేద్యాల సమర్పణ, ఊయల ముహూర్తం, మొక్కులు చెల్లింపులతో ప్రారంభమై, రాత్రి అమ్మవారి జాతర సందర్భంగా వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు. అమ్మ వారు వెండి చీర, బంగారు నగలతో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. గురువారం ఉదయం నుంచి అమ్మవారి తీర్థం ప్రారంభమతుందని పేర్కొన్నారు.

వైభవంగా భక్తాంజనేయ స్వామి ఉత్సవాలు

మండపేట: శ్రీ భక్తాంజనేయ స్వామి ఉత్సవాలు కేశవరంలో మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రసిద్ధి చెందిన భక్తాంజనేయ ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామంలో స్వామి వార్లతో గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు, చిన్నారులు, రామ భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గ్రామోత్సవంలో స్వామి రథం వెంట నడిచారు. భజన మండలి బృందాలు ఊరేగింపులో పాల్గొని కీర్తనలు ఆలపించారు. 17న సుదర్శన హోమం, 18న సీతారాముల కల్యాణాన్ని అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నామని నిర్వాహక కమిటీ సభ్యుడు, ఎంపీటీసీ అన్నందేవుల కృష్ణారావు తెలిపారు.

హామీల అమలులో కూటమి విఫలం



యువత పోరును విజయవంతం చేయాలని కోరుతూ యువతను ఆహ్వానిస్తున్న పార్టీ నాయకులు

కాజులూరు: ఎన్నికల నాటి హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పిల్లి కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం కృష్ణమూర్తి తదితర నాయకులు మండల గ్రామాల్లో పర్యటించి అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో బుధవారం జరగనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ కార్యకర్తలు, నాయకులు, యువకులను ఆహ్వానించారు. గొల్లపాలెంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయడంలో అన్ని వర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ముఖ్యంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయకపోవడంతో పేద విద్యార్థులు చదువు ఆపాల్సి వస్తుందన్నారు. చంద్రబాబు మొదటి సంతకమైన డీఎస్సీ నోటిఫికేషన్ ఆలస్యం కావడం, లోకేష్ ప్రకటించిన జాబ్ కేలండర్ విడుదలవ్వకపోవడం, యువతకు నిరుద్యోగ భృతి విడుదల కాకపోవడంతో యువత అన్ని విధాలుగా మోసపోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో యువతకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ అమలాపురంలో జరగనున్న యువతపోరుకు అన్ని వర్గాల ప్రజలు తరలి రావాలన్నారు. పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, రామచంద్రపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు ద్రాక్షారామ బోసుబొమ్మ సెంటర్ నుంచి కార్యకర్తలు, యువత అధిక సంఖ్యలో ర్యాలీగా అమలాపురం తరలివెళ్లనున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ పితాని సుబ్రహ్మణ్యం, మండల బీసీ సంఘం అధ్యక్షుడు చొల్లంగి రమణ, జిల్లా కమిటీ సభ్యుడు యాళ్ల సత్తిబాబు, ఆంజనేయులు, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు పెంకే వెంకటరమణ, చింతా నవీన్, దంగేటి వెంకన్న పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో శాంతి కల్యాణం



ద్రాక్షారామలో పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారుని సత్కరిస్తున్న రాజు, జ్యోతి దంపతులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రముఖ హిందూ ప్రచార ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు ఆధ్వర్యంలో వారం రోజుల పాటు (168 గంటలు) నిర్వహించిన అఖండ భగవన్నామ సంకీర్తన (సప్తాహం) ముగింపు సందర్భంగా మంగళవారం పూర్ణాహుతి, శాంతి కల్యాణం నిర్వహించారు. గడచిన తొమ్మిదేళ్లుగా భీమేశ్వరాలయంలో సప్తాహం నిర్వహిస్తున్న పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు, భజన కళాకారులను ఆలయంలో నైట్ వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న సుబేధి రాజా దుర్గాదత్తా, జ్యోతి దంపతులు క్రమం తప్పకుండా ఏటా మాదిరిగానే సత్కరించి నూతన వస్త్రాలు, జ్ఞాపికలు అందజేశారు. పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు సప్తాహం దిగ్విజయంగా పూర్తి కావడానికి సహకరించిన ఆలయ ఈఓ అల్లు వెంకట దుర్గాభవాని, సీనియర్ అసిస్టెంట్ వెంకన్నబాబు, సిబ్బందికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రాచీన తెలుగు జానపద వృత్తి కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ (సతార్ స్వామి), గరగ బాబూరావు, ఏలూరి మణికంఠ, ఏడునూతుల మురళి, మేడిశెట్టి సత్యనారాయణ, నీలం పట్టాభి, ముద్రగడ సత్యమూర్తి, కటారపు సత్యనారాయణ, నాగు, భజన బృందాలు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రానికి చేరిన పదోతరగతి సెట్-1 పేపర్లు

నేడు సెట్-2 రాక



అమలాపురం చేరుకున్న పది పరీక్ష పేపర్లు

రాయవరం: ఈ నెల 17వ తేదీ నుంచి పది పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్ష పేపర్లు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. పది పరీక్షలకు సంబంధించి సెట్-1 పేపర్లు మంగళవారం చేరుకోగా, సెట్-2 బుధవారం జిల్లాకు రానున్నాయి. సెట్-1 పేపర్లు బుధవారం నుంచి అన్ని పోలీస్ స్టేషన్లకు సరఫరా కానున్నాయి. తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, గణితం, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ పేపర్లు జిల్లా కేంద్రానికి చేరుకోగా అన్ని సబ్జెక్టుల సెట్టు-2 పేపర్లు రానున్నాయి. జిల్లా కేంద్రానికి చేరుకున్న 10 పరీక్ష పేపర్లు అమలాపురం బాలుర ఉన్నత పాఠశాలలో పోలీస్ బందోబస్తు నడుమ భద్రపరిచారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య 10 పబ్లిక్ పరీక్ష పేపర్లను మండల కేంద్రాలకు తరలించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం బాషా తెలిపారు.

యువత పోరును విజయవంతం చేయాలి

మండపేట: ఎన్నికల ముందు అమలు కాని హామీలు ఇచ్చి తీరా గద్దెనెక్కాక హామీలు నెరవేర్చకుండా ప్రజలతో దోబూచులాడుతున్నారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు చోడే శ్రీకృష్ణ కూటమి ప్రభుత్వాన్ని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు బధవారం యువత పోరు కార్యక్రమం చేపట్టామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి ఇంకా విద్యా పథకాలు అమలు చేయాలనే డిమాండుతో బుధవారం అమలాపురం కలెక్టరేట్ వద్ద చేపట్టే యువత పోరు కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున యువత, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని శ్రీకృష్ణ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నాయకత్వంలో మండపేట విజయలక్ష్మి నగర్ కార్యాలయం నుంచి అమలాపురం ర్యాలీగా తరలివెళ్తామన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాల స్వాధీనం

కపిలేశ్వరపురం: వడ్లమూరు గ్రామ శివారులో అక్రమంగా మద్యం సీసాలు నిల్వ ఉంచిన కె.సురేష్‌ను ఈ నెల 10న అంగర పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై డి.రవికుమార్ మంగళవారం మాట్లాడుతూ ఎలాంటి అనుమతీ లేకుండా 180 ఎంఎల్ కలిగిన 10 మద్యం సీసాలను అదే గ్రామానికి చెందిన సురేష్ వద్ద గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఎక్సైజ్ యాక్టు 2023 ప్రకారం నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై రవి కుమార్ తెలిపారు.

వైభవంగా గోపాలస్వామి కల్యాణం



అంగరలో వేణుగోపాలస్వామి కల్యాణం చేస్తున్న పండితులు

కపిలేశ్వరపురం: అంగరలోని శ్రీరుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. దేవతామూర్తులను అర్చకులు విశేషంగా అలంకరించారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు స్వామి కల్యాణాన్ని వీక్షించారు. బుధవారం ఆలయంలో సదస్యం, పండితాశీర్వచనం, పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి రాంబాబు తెలిపారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి



టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న సంయుక్త సంచాలకుడు కేవీవీఎస్ మూర్తి

కె.గంగవరం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి పాడి పశువుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని అమలాపురం సంయుక్త సంచాలకుడు కేవీవీఎస్ మూర్తి అన్నారు. మండలంలోని సత్యవాడ, కె.గంగవరం గ్రామాల్లో జరుగుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తారని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో ఈ టీకాల కార్యక్రమం పశువైద్య సిబ్బంది నిర్వహిస్తారన్నారు. అనంతరం రెండు గ్రామాల్లో 250 పశువులకు టీకాలు వేశారు. పామర్రు పశువైద్యాధికారి బిందు, కె.గంగవరం పశువైద్యాధికారి భావన జ్యోతి, ఇతర సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



తడి, పొడి చెత్తను వేరు చేసే విధానంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఈవోపీఆర్డీ గౌరీకుమారి

కె.గంగవరం: గ్రామాల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సరైన పద్ధతిలో సద్వినియోగం చేసుకుంటే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఈఓపీఆర్డీ గౌరికుమారి, సర్పంచ్ చిల్లి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కూళ్లలో మంగళవారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలకు పూర్తి స్థాయిలో చెత్తను అందించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. గతంలో ప్రతి ఇంటికీ వచ్చిన తడి, పొడి చెత్త డస్ట్‌బిన్లను సద్వినియోగం చేసుకుని తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని కోరారు. సంపద తయారీ కేంద్రాలకు తరలించి చెత్తను ఎరువుగా మార్చవచ్చన్నారు. తొలుత గ్రామంలో పారిశుధ్యంపై గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు ర్యాలీ నిర్వహించారు. కార్యదర్శి ముద్రగడ చంటి, గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.